రాజారాం మామయ్య ఊరు వెళ్ళాడు. వెళ్ళి ఇప్పటికి నలభై ఎనిమిది గంటల ముప్పై నాలుగు నిముషాలయింది. రెండు రోజుల్లో వస్తానన్నాడు. ముప్పై నాలుగు నిముషాల లేట్‌లో ఉన్నాడు, నాకంటే పదిహేను ఏళ్ళు ముందు పుట్టిన మామయ్య.

అసలు మా మామయ్యని నేను రెండేళ్ళ క్రితంవే 'మావయ్యా' అని పిలవడం మానేశాను- యూనివర్సిటీ నుంచి వచ్చి ఇరవైయవ పుట్టిన రోజు చేసుకున్న వేసవి తర్వాత. ఆ ఆషాఢ మాసంలో కూడా మావయ్య నన్ను వదల్లేదు.

అన్నట్టు- అప్పట్నించీ మావయ్యని నేను 'మీరు' అనడం అలవాటు చేసుకున్నాను నలుగుర్లో. ఏకాంతంలో మాత్రం తరచుగా 'మావయ్యా' అనీ, ఒక్కొక్క మూడ్‌లో 'రాజా' అని కూడా పిలవడం అప్పట్నించే.

# సముద్రం

మా 'రాజా' గురించి మీకు తెలీదు కదా!

తను విజయా వాళ్ళ సినిమా లాంటి వాడు. మేధావి వర్గం నుంచి సామాన్య ప్రజల దాకా ఆరాధనీయుడు.

అలాటి మావయ్య కోసమే నేను పుట్టేనట.

చూసేరా! మావయ్య ఇంకా రాలేదు. ఈ ఉదయం నుంచీ పడిన ఉద్వేగమంతా ఒక ఎత్తు- ఇది మావయ్యతో చెప్పేదాకా ఆగలేకపోవడం ఒక ఎత్తు.

ఈలోగా మీతోనయినా ముచ్చటిస్తాను.

* * *

పొద్దున్నే మెలుకువ వచ్చేసింది. చూస్తే పక్కన 'రాజా' లేడు. సడెన్‌గా గుర్తొచ్చింది ఊరు వెళ్ళాడు కదా అని!. 'ఎంత అలవాటో!' అని నవ్వుకున్నాను- సాధారణంగా నాకు ఏదీ అలవాటు కాదు- అని చిన్న గర్వం ఉన్న నేను.

అలా బద్ధకంగా పడుకునే ఉన్నాను.

పియానో మెట్టునొక్కినప్పటి సన్నటి సంగీతపు ధ్వని.

మావయ్యే వచ్చి వుంటాడని చటుక్కున లేచాను.

మా 'రాజా' వస్తుంటే పియానో వాయిస్తున్నట్టుంటుందనుకుంటారేమో! కాదు సుమా! నా కోరిక ప్రకారం మా 'వారే' అలాటి కాలింగ్ బెల్ ఏర్పాటు చేశారు.

అందుకే మావయ్యకి నేనంటే అంత ఇష్టం.

'కళని జీవితంలో అద్భుతంగా పొదుగుకున్న పిల్లవే నువ్వు' అంటాడు. అందుకే నా కోసం అంత కాలం ఆగి ఆ ప్రౌఢ యౌవనంలో ముప్పై అయిదేళ్ళ పెళ్ళికొడుకు అయ్యాడు.

ఇంతకీ తలుపు తీసేసరికి రమ. వాళ్ళాయనతో.. ఊహించని విధంగా.

"ఏమే జయా! తెల్లవారకుండా వచ్చి పడిపోయి మిమ్మల్ని డిస్టర్బ్ చేసినట్టున్నామా?" అంటూ సూట్‌కేస్‌లతో లోపలకు అడుగుపెట్టింది రమ.

రమ పెళ్ళి అయ్యాక ఇదే చూడ్డం. ఇంకా బావుంది ఇప్పుడు.

"లేదు లేవే! ఆయన కేంప్‌లో ఉన్నారు" అంటూ సూట్‌కేస్ అందుకున్నాను.

"వీరు మావారు. నేవల్ ఆర్కిటెక్ట్. నీకు తెలిసే వుంటుంది. అమ్మావాళ్ళని చూసి వెళ్దామని వచ్చాం. మళ్ళీ ఎప్పటికి వస్తామో! నిన్ను చూసి, చూపించి పోదామని—"

దాని మాటలు వింటూనే, దాని వెనుకే నిలబడిపోయిన అతన్ని చూశాను. చామన చాయ, పెద్దపెద్ద కళ్ళు. చురుకయిన చూపులు.

కళ్ళతోటే 'విష్' చేశాడు- కళ్ళతోటే విష్ చెయ్యడానికి అలవాటు పడడం మూలంగా ననుకుంటా.

కాని నాకు చాలా కొత్తగా థ్రిల్లింగ్‌గా అనిపించింది. తెలీకుండా గుండె ఝల్లుమంది- కాని ఆ సంగతి చాలా సేపటికి కాని గుర్తించలేకపోయాను.

లోపలికి వచ్చారు. పలకరింపులూ, విశేషాలూ అయ్యాయి. రమ కాలకృత్యాల్లో పడి కృతకృత్యురాలవుతూంటే- అతను ఇల్లంతా పరిశీలనగా చూడడం మొదలు పెట్టాడు.

నేను ప్రతి చిన్న పని నుంచీ పెద్ద పని దాకా చాలా అందంగా చేస్తానట. చీర మడతపెట్టడం నుంచి, ముగ్గుపెట్టడం దాకా- అని మావయ్య అంటాడు. "ఆ చేతిలో గొప్ప 'స్కిల్' ఉంది- అదే నన్ను మోహపెట్టి నీ వెంట తిప్పుకుంటోంది" అంటూ.

నిజానికి, నన్ను చిన్ననాటినుంచీ నేటి వరకూ అద్భుతంగా మలిచింది తనే. పోతే- నా చేతిలో మావయ్య చెప్పిన 'స్కిల్' అన్నది సహజంగానే ఉంటే గనక- అది- నా భాగ్యం.

అలాంటిది ఈ ఆర్కిటెక్ట్ ప్రతి అంగుళమూ పరిశీలించి చాలా నిజాయితీగా మెచ్చుకొన్నాడు.

దాదాపు ఓ నలభై నిముషాలు మేమిద్దరమూ మాటాడుకుంటూనే వున్నాం.

"నాకు చిన్నప్పటినుంచీ పెయింటింగ్ హాబీ అండీ. కాని నేను ఇంత కాలమూ తెలుసుకోలేకపోయింది ఇప్పుడు తెలుస్తోంది. బొమ్మలు వెయ్యడం, వాటిని రంగులతో ముంచెత్తడం ఇది హాబీకాదు- నా జీవ లక్షణం- అని. జీవితాన్ని ఇలా రంగు రంగుల అందాలతో మేళవించు

# భమిడిపాటి జగన్నాథరావు




కోవడంలోని హాయినే నేను హాబీ అని అనుకున్నాను. నాకు ఏదో అడ్డుగా వున్న తెర తొలగిపోయినట్టుంది మీఇల్లు చూస్తే" అన్నాడు.

అతని మాటల్లోని ఆ 'డిసప్పాయింట్ మెంట్', ఆ ధ్వని నా గుండెలో ఎక్కడో తగిలి నన్ను జాలితో కుదిపి వేసింది.

నాకు తెలుసు. రమ చాలా మెటీరియలిస్ట్.

అయినా హాయిగా ఉండడానికి ఇవేవీ అడ్డు కాదు.

కాని- అతని మాటలూ, చూపులూ- నాకు చాలా ఇష్టంగానూ. ఇబ్బందిగానూ ఉన్నాయి.

త్వరత్వరగా వంట చేశాను నేనే. నాకు అలవాటైన పద్ధతిలో భోజనాలు రెడీ చేశాను.

ఆ ఏర్పాట్లు చూసి అతను 'థ్రిల్' అయిపోయాడు, నేను ఊహించినట్లుగానే నాకు చాలా గర్వంగా వుంది.

"మీరు గొప్ప 'లైఫ్'తో జీవిస్తున్నారండీ— జయదేవుడి గీతానికి రూపంవచ్చినట్టు; అనుభూతి ఆకృతైనట్టు...."

"జయదేవుడి గీతాలంటే- సుశీల పాడింది- 'హరిరిహ ముగ్ధ' అదేనా? మనింట్లో టేప్‌లో వుంది కదూ" రమ అడుగుతోంది.

ఈ విరుద్ధ ధృవాల పద్ధతి నాకు చాలా గమ్మత్తుగా వుంది. మావయ్య, నేను ఒక మూడ్‌లో వుండి మాట్లాడుకుంటూంటే చుట్టూ వున్న వాళ్ళెవరూ మాకు పట్టరు. వాళ్ళు గోల చేస్తారు - 'మీరే లోకంలో వున్నారు బాబూ! గంధర్వ లోకవా? కొంచెం మాకూ తెలిసేలా మాట్లాడండి-' అని.

పాపం! ఎంత కష్టం? ఇతనికి.

భోజనం చేశాక "పైగదిలో కామ్‌గా ఉంటుంది. కాసేపు విశ్రాంతి తీసుకోండి" అన్నాను.

"నో-నో- మీతో చాలా కబుర్లు చెప్పాలి. మీ లైబ్రరీ చూడాలి. నాకు మీరు మంచి కంపెనీ" అంటూ అతడు కిందనే వుండిపోయాడు.

రమ మాత్రం ఆవలిస్తూ మెట్లు ఎక్కి వెళ్ళిపోయింది.


తెల్లటి షర్టు- ఫుల్‌హాండ్స్. తెల్లి లుంగీ. మగవాళ్ళు తెల్లలుంగీ మానేసి చాలా కాలం అయిపోయింది. కాని మళ్ళీ మొదలుపెడతారేమో ఇతన్ని చూస్తే అనిపించింది.

ఒక్కొక్కటీ వరుసగా అన్ని పుస్తకాలూ చూశాడు. వెంటే ఉన్నాడు. వదలాలనిపించడంలేదు. ఏదో శక్తి. లేకపోతే ఆకర్షణ. ఏదో నన్ను అతనివేపు లాగుతోంది.

ఒకటీ, ఒకటీ నేను వ్రాసిన ఆర్టికల్స్. నేను కలక్ట్ చేసినవీ చూపిస్తూ చూస్తూ- రెండయింది.

"అసలు ఇవన్నీ ఏ కొద్ది మందికో తప్ప- సాధారణంగా ఎవరికీ చూపించను నేను".

"మీకు కాఫీ అలవాటుందా?" అన్నాను అన్నీ సర్దేసి, లేచి.




"నాకు ఏదీ అలవాటు లేదండీ! కాని మీరు ఇస్తే తప్పక తీసుకుంటాను. ఎంత అందమైన కప్పుతో ఇస్తారో చూద్దాని కయినా!"

కాఫీ కలపడానికి వంటింట్లోకి వెళ్ళేను. వెంటే వచ్చారు ఎంతో సహజంగా. తను పాటలు పాడతాడట - చిన్న చిన్నవి రాస్తాడు కూడానట.

ఎంతో దగ్గరతనం ఫీలవుతూ అన్నీ చెప్తున్న అతన్ని చూస్తుంటే నాకు తెలీకుండానే గొప్ప ఉత్సాహాన్ని అనుభవిస్తున్నాను.

షుగర్ టిన్ అందించాడు. స్టాండ్ లోంచి 'స్పూన్స్' తీసి ఇచ్చాడు.

బీరువా తెరుస్తూ కప్పులు తీస్తూ "మీరు పదండి హాల్లోకి-" అన్నాను.

కప్పుల్లో కాఫీ నింపి హాల్లోకి తీసి కెళ్ళాను.

అతనింకా థ్రిల్ అయ్యేలాగ నాకు ఇంకా దగ్గరగా వచ్చేలాగ ఉండాలని అనిపిస్తోంది. అందుకే ఆ కప్పులు తీశాను.

అవి సన్నటి గాజుతో తయారయిన కప్పులు. బజారంతా వెతికి వెతికి. నేనే కొన్నాను వాటిని.

వాటిమీద మావయ్య లేత పచ్చటి కాడల తెల్లటి చిన్న చిన్న పూలు ప్రత్యేకంగా పెయింట్ చేశాడు.

మేమిద్దరమూ రాత్రి పూట పాలు తాగే కప్పులవి-

ఈ పగటి పూట తీశాను.

అతని ఆనందం, సౌందర్య పిపాస నాకు స్పష్టంగా తెలుస్తోంది.

కాఫీ— అమృతంలా— తీసుకున్నాడు.

ఎందుకిలా చేస్తున్నాను? అన్న ఆలోచన కలుగుతోంది. కాని-బలమైన ఆకర్షణ ఆ వైపునుంచి లాగుతోంది నన్ను. నేను దీన్ని ఆపాలనికాని, ఆణచాలనికాని అనుకోలేదు. ఈ అనుకోకపోవడానికి వెనుక వున్నది మా మావయ్య శిక్షణ.

కాన్ఫిడెన్షియల్ పెయింటింగ్స్- మావయ్య వేసినవి. మాకు చాలా అపురూపమయినవీ, ఆ ఆల్బమ్ కూడా అతని ముందు పెట్టకుండా ఉండలేకపోయాను. ఫొటోల ఆధారంగా, రంగులతో ప్రయోగాత్మకంగా వేసిన చిత్రాలవి.

'వెన్ వుయార్ టుగెదర్' అన్న శీర్షిక కింద-తెల్లటి మబ్బుల గుంపుల్లో మావయ్య వడిలో నేను.

పేజీ తిప్పగానే పచ్చికలో తెల్లటి కుందేలు పిల్లలా కేరింతలతో-దాని కింద 'హరిత సముద్రపు కెరటాలు వాలిన వెన్నెలే మేము-' అనీ.

ఇలా మా అన్యోన్యత, మా ఇష్టం. మావయ్య ఎప్పుడూ చెప్పే మా ఏకత్వం నింపిన ఆ బొమ్మలు- ప్రఖ్యాత చిత్రకారుడు మావయ్య చిత్రించిన మా జీవితం అంతా అందులో వుంది.

"ఈయనే మీవారా? అరె! ఈయన ఫొటో నేను 'సన్‌డే'లో చూశానే. చాలా గొప్ప తేజస్సు ఉందండీ ఈ కళ్ళల్లో. నేను ఆనాడే అనుకున్నాను- ఆర్టిస్ట్‌కి ఉండే తపన. ఆరాటమూ కాక గొప్ప కాంతి కనిపిస్తోంది ఈయనలో అని-"

అంటూ ఆ జీవితచిత్రాలు చూడడంలో మునిగిపోయాడు.

ఇవి ఎవ్వరికీ చూపించనివి-మావయ్యా, నేనూ ఏకాంతంలో చూసుకునేవి. ఇతనికి చూపించాలనే ఈ బలమైన కోరికను నేను జయించాలనుకోలేదు. మావయ్య సత్యాన్వేషి- నేను అతని అడుగుజాడల్లో నడవాలనే బలమైన కోరికతో బతుకుతున్నదాన్ని కదా! మరి.

అతని మనస్థితి ఎలా ఉంటుందో నాకు తెలుసు. నేనేనా సరే! ఇలాటి వాతావరణం ఎక్కడయినా చూస్తే నిలువెల్లా కదిలిపోతాను.

అతన్ని అలా కదిపెయ్యాలని నా ఈ కోరికెందుకు-?

అతను గొప్ప సాహిత్యం చదువుతున్నట్టు. అద్భుతమైన సంగీతం వింటున్నట్టు. మా జీవన సంగీతం చూస్తూ ఉండిపోయాడు.

అతన్ని నేనే కదిపాను.

కదిలి "ఆర్టిస్టులు సాధారణంగా జీవితంలో ఫెయిల్ అవుతూ వుంటారు. అంటే ప్రాక్టికల్ లైఫ్‌లో వాళ్ళేమీ మిగుల్చుకోలేరు. కానీ-మీ వారు-ఇంత గొప్ప పెయింటర్-వారి ఆర్టంతా జీవితంలో ఇలా మలుచుకొని-" అతనికి ఆ పైన మాటలు దొరకలేదు.

"అవును. మావయ్య అంటుంటాడు. చిన్న పరిధిలో హాయిగా జీవిస్తూ, చూపును దిగంతాలకు సారించాలని." ఆ 'వంతెన' అతని చిత్రాలలోంచి ధ్వనిస్తూవుంటుంది.

గమ్మత్తేమిటంటే 'మన ఇలాటి కావ్యగానంలాంటి జీవితానికి కారణం నువ్వేరా జయాలూ' అంటాడు తనే.

"మనం అలా కాస్సేపు తిరిగివద్దాం. లేవండి. రమని లేపి వస్తాను" అంటూ లేచాను

నాకు చాలా ఇష్టమయిన చీర కట్టుకున్నాను. ఆ చీరలో నేను చాలా అందంగా ఉంటానని నాకు స్పష్టంగా తెలుసు-కానీ ఆ చీర ఎందుకు కట్టుకోకుండా ఉండలేకపోయానో మాత్రం స్పష్టం కావడంలేదు.

రమ భర్త కళ్ళల్లోని ఆ మెప్పుదలని నేను అవలీలగా గ్రహించగలను-ఇలాటివి ఎన్నో కబుర్లు మావయ్య కళ్ళతోనే వినే




అలవాటున్న నేను.

రాత్రి వాళ్ళు వెళ్తున్నారు. సడెన్‌గా ఈ లోకంలో పడ్డట్టు అయింది నాకు. ఇతను ఇలా నాతోనే వుంటాడని ఎందుకో నాలో కలిగిన, నిశ్చయమైన ఊహ- ఆధారంలేనిది.

ఉదయం వచ్చిన గెస్ట్లు-సాయంత్రం వెళ్ళిపోతున్నారు.

అతను వెళ్ళకుండా వుంటే బావుణ్ణని- బెంగగా, ఉద్వేగంగా- ఇదెలా సాధ్యం!!

ఏమిటి! నేను! ఏమై పోతున్నాను!!

ఏమిటీ వదల్లేకపోవడం !!

ట్రైన్ కదిలింది. వెళ్ళారు వాళ్ళు- నిద్రలో నడుస్తున్నట్టు నేను ఇంటికి.

* * *

అదండీ కథ.

చాలా సేపటి తర్వాత, ఇలా తీరిగ్గా కూచుని ఆలోచిస్తూంటే చిత్రంగా ఉంది. మావయ్యతప్ప ప్రపంచంలో మరో మగాడే లేడనుకున్నదాన్ని-మీరా-లా-ఈ నేను- ఆ నేనేనా! మావయ్యా, నేను మా ప్రేమతో ఏకత్వం సాధించిన వాళ్ళం. ఒకరి గురించి ఒకరం తదేక ధ్యానంతో జీవిస్తున్న వాళ్ళం. ఈ రోజు ఈ అర్కిటెక్ట్ ఇలా నా గుండెలో గుబులురేపి, నన్నిలా ఇన్ని గంటలు అలజడికి లోను చేసి వెళ్ళేడే!!

* * *

నా 'రాజా' గుండెల్లో దూరి పడుకున్నాను; చాలా సేపటి నుండీ. నా జుట్టు నవరిస్తూ, బొట్టు సరిచేస్తూ- అలా మౌన సంగీతం వింటూ మావయ్య.

"రాజా! 'రజనీగంధ' సినిమా నీ కెందు కంత ఇష్టం ? అని అడిగేదాన్ని కదా! ఇపుడు తెలిసింది" అన్నాను.

"ఏం తెలిసింది?"

"నువు చెప్తావు చూడు- ఈ జీవితపు హద్దులు మహా విస్తృతమైనవనీ,మామూలు నీతి సూత్రాల్లో బంధించాలని ప్రయత్నించడం వ్యర్థ ప్రయత్నమనీ-

"నేనెవరితోనూ చెప్పలేదీ మాటలు. నీలాంటి మార్జిన్‌లెస్ పేజీకి తప్ప- "ఉడికిస్తున్నట్టు గొప్ప కాంప్లిమెంటు నాకు.

"అదేలే. నాతోనే. ఆ జీవితపు విస్తృతిని విప్పి చెప్పే ప్రయత్నం చేశాడు- బాసూ ఛటర్జీ ఆ సినిమాలో.ఆ ప్రయత్నం ఆ అవగాహన గొప్పది కదూ" అన్నాను.

మావయ్య చిన్నగా నవ్వాడు.

అన్ని విషయాలు, విజ్ఞత-అన్నీ నా అంతట నేను తెలుసుకునే దాకా ఆగి-నా కోసం పదిహేనేళ్ళు ముందు పుట్టి- 'వెయిట్' చేసిన మావయ్య నవ్వాడు.

విజ్ఞానమూ, వివేకమూ కలిసిన వెలుగులు విరిసినట్లు నవ్వాడు.

"అదేరా జీవితం గాఢత. నేనంటే ఇంత పిచ్చి నీకు. క్షణం వదల్లేం మనం ఒకరి నొకరం. కానీ- అతనెవరో-మహా అదృష్టవంతుడు-కొన్ని గంటల కాలం.... నిన్ను గురించి, కదిలి, నిన్ను కుదిపి, తన వేపు తిప్పుకుని మహా భాగ్యవంతుడై వెళ్ళాడు. ఇది-ఇలాంటిది.... ఎప్పుడైనా మనం ఊహించామా!"

"ఇలా జరిగినందుకు ఏ మూలో- నాకు కొంచెం గిల్టీ గా ఉంది మావయ్యా" అన్నాను.

నన్ను ఇంకా పొదివి తనలోకి తీసుకున్నాడు మావయ్య.

"చూడు జయలూ- జీవితం చాలా గొప్పది. అందుకే ప్రపంచంలోని మహా రచయితలందరూ వారి ఆదర్శాలకంటే జీవితపు గొప్పదనానికే తల వొంచారు.

అమ్మలూ- నీ మనసులో అలా చిన్నతనం ఫీలవకు- అని నేను చెప్పను. నీకే తెలియాలి-అది అనవసరమని".

అతని చేతుల్లో రంగుల పూలచెండులా వున్నాను నేను.

నా బుగ్గమీద సున్నితంగా వేలు సవరిస్తూ చుబుకం దగ్గరవున్న పుట్టుమచ్చ దగ్గర ఆగేడు 'రాజా'

చిలిపిగా అడక్కుండా ఉండలేక పోయాను.

"రాజావారు చిన్న అసూయపడుతున్నా రేమోనే!"

పక పక పక నవ్వాడు రాజా.

"అవును, నిన్న కొన్ని గంటలసేపు నిన్ను అలరించిన అతను- నేనెందుకు కాలేకపోయానా! అని-అసూయే మరి!"

మా మావయ్య నవ్వులోంచి నన్ను తాకి, నాలో నిండిన కాంతి.... అపురూపమైనది.

మా మావయ్య రాజా కాదు.

రాజా రాముడు. ●